ప్రజా మారుతి
తెలంగాణ జాతీయ దినపత్రిక
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు


ఫోన్ ట్యాపింగ్ కేసులో.. 7 గంటల పాటు కేటీఆర్ విచారణ

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 198 పేజిలు : 04 వెల రూ. 2 శనివారం 24 - 01 - 2026

### ఇన్నోవేషన్ సంస్థను దావోస్‌లో

# ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి

- ఏఐ ఆవిష్కరణల అమలుకు 'ఐకమ్'
- దావోస్ వేదికగా ఆవిష్కరించిన సీఎం రేవంత్
- ఇన్నోవేషన్ సంస్థను దావోస్‌లో ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి
- కృత్రిమ మేధను ప్రయోగాల దశ నుంచి ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యమని వెల్లడి
- భారత్‌లోనే తొలి ఎకోసిస్టమ్ ఆధారిత ఓపెన్ ఇన్నోవేషన్ సంస్థ 'ఐకమ్'
- ప్రయోగ వేదికగా తెలంగాణను ఒక ప్రయోగ వేదికగా నిలిపే లక్ష్యంగా 'ఐకమ్' నిలుస్తుందని రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు
- కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి, ఐటీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్‌కుమార్, ఐకమ్ వ్యవస్థాపక సీఈవో ఫణి నాగార్జున పాల్గొన్నారు



హైదరాబాద్ : ఇప్పటి వరకు ఏఐ(కృత్రిమ మేధ) అంటే ప్రయోగాలు, స్టార్టప్ డెమోలు, పైలట్ ప్రాజెక్టులకు పరిమితమైంది. ప్రస్తుతం ప్రపంచం ఒక కీలక మలుపులో నిలిచింది. ఇలాంటి పరిస్థితుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను బాధ్యతాయుతంగా, విశ్వసనీయంగా ప్రజల జీవితాల్లోకి తీసుకెళ్లి ఏవిధంగా అమలు చేయాలన్నదే అసలైన సవాల్. దీనికి పరిష్కారంగా తెలంగాణ ప్రభుత్వం తీసుకొస్తున్న భారత్‌లోనే తొలి ఎకోసిస్టమ్ ఆధారిత ఓపెన్ ఇన్నోవేషన్ సంస్థ 'ఐకమ్'.ఇది బిగ్ డేటా వినియోగం, ఏఐ నైపుణ్యాల విస్తృత అభివృద్ధి, ప్రపంచ స్థాయి స్టార్టప్‌లకు ప్రోత్సాహం, అత్యాధునిక కంప్యూటింగ్ మౌలిక వసతులతో బాధ్యతాయుత ఏఐ ఆవిష్కరణలకు తెలంగాణను ప్రపంచ వేదికగా నిలబెడుతుంది అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ఐకమ్‌'ను రేవంత్ రెడ్డి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి, ఐటీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్‌కుమార్, ఐకమ్ వ్యవస్థాపక సీఈవో ఫణి నాగార్జున పాల్గొన్నారు.ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ప్రయోగాలతోపాటు - మిగతా 2 లో

### కార్తీకదీపం సరే...

### ముందు మీ దీపం ఆరిపోకుండా చూసుకోండి



- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్
- కేటీఆర్ వ్యాఖ్యలపై మహేశ్ గౌడ్ ఫైర్
- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేటీఆర్ ఆత్మపరిశీలన చేసుకోవాలని వ్యాఖ్య
- కవితను చెల్లెలుగా గౌరవిస్తానన్న పీసీసీ చీఫ్

హైదరాబాద్ : ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న విమర్శలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఘాటుగా స్పందించారు. మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడిన ఆయన... వ్యక్తిగత హననం జరుగుతోందని కేటీఆర్ అనడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. రాజ్యాంగ పరిధిలోనే విచారణ సాగుతోందని - మిగతా 2 లో


2 లో

### జనగామలో మంత్రి సీతక్క

## పర్యటనలో ఉద్రిక్తత

అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలో కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట

కొబ్బరికాయ కొట్టేందుకు బీఆర్ఎస్ నాయకులను ఆహ్వానించిన ఎమ్మెల్యే

బీఆర్ఎస్ కార్యక్రమం కాదని కాంగ్రెస్ నాయకుల అభ్యంతరం

## ఇరాన్ పై కమ్ముకుంటున్న యుద్ధ మేఘాలు

- భారీగా ఆయుధాలు తరలిస్తున్న అమెరికా!
- ఇరాన్ అణు కార్యక్రమం కొనసాగిస్తే మళ్లీ దాడులు తప్పవన్న ట్రంప్
- అమెరికా హెచ్చరికలతోనే ఇరాన్ ఉరిశిక్షలు నిలిపివేసిందన్న వాదన
- మధ్యప్రాచ్యానికి తరలివస్తున్న భారీ యుద్ధ విమాన వాహక నౌకలు
- ఇరాన్ అల్లర్లలో 20 వేల మందికి పైగా మరణించినట్లు అంచనా
- శాంతి స్థాపన కోసం 'బోర్డ్ ఆఫ్ పీస్' ఏర్పాటు చేసినట్లు ప్రకటన



2 లో

### కేరళలో కొత్త రైళ్లకు

# ప్రధాని మోదీ పచ్చజెండా

- తెలుగు రాష్ట్రాలకు మరో సర్వీస్
- కేరళలో మూడు అమృత్ భారత్, ఒక ప్యాసింజర్ రైలును ప్రారంభించిన ప్రధాని
- తిరువనంతపురం నుంచి తెలంగాణలోని చర్లపల్లికి కొత్త అమృత్ భారత్ సర్వీసు
- నాన్-ఏసీ కోచ్‌లలోనూ సీసీటీవీ, చార్జింగ్ సాకెట్ల వంటి మెరుగైన సౌకర్యాలు
- సామాన్యులకు తక్కువ ధరలో సౌకర్యవంతమైన ప్రయాణం లక్ష్యంగా ఈ రైళ్లు
- ఈ కొత్త రైళ్ల నిర్వహణ బాధ్యతలను చూడనున్న దక్షిణ రైల్వే



తిరువనంతపురం : ప్రధాని నరేంద్ర మోదీ కేరళలో కొత్త రైల్వే సేవలకు పచ్చజెండా ఊపారు. తిరువనంతపురం నుంచి మూడు కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు ఒక ప్యాసింజర్ రైలును ఆయన ప్రారంభించారు. దేశంలో రైల్వే కనెక్టివిటీని ఆధునికీకరించే ప్రయత్నాల్లో భాగంగా ఈ కొత్త సర్వీసులను అందుబాటులోకి తెచ్చారు.కొత్తగా ప్రారంభించిన వాటిలో తిరువనంతపురం-చర్లపల్లి, నాగర్‌కోయిల్-మంగళూరు, తిరువనంతపురం-తాంబరం అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. వీటితో పాటు త్రిస్సూర్-గురువాయూర్ మధ్య కొత్త ప్యాసింజర్ రైలును కూడా ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం - మిగతా 2 లో

## మంచులో 12 మంది...

## 3 గంటలు శ్రమించి కాపాడిన పోలీసులు

- జమ్మూకశ్మీర్‌లో భారీ మంచులో చిక్కుకున్న 12 మంది స్థానికులు
- మూడు గంటల పాటు శ్రమించి వారిని కాపాడిన ఉధంపూర్ పోలీసులు
- రక్షించిన వారికి ఆహారం, ఆశ్రయం కల్పించిన అధికారులు
- ప్రతికూల వాతావరణంతో ఉధంపూర్‌లోని పాఠశాలలకు సెలవు



జమ్మూకశ్మీర్ : జమ్మూకశ్మీర్‌లోని ఉధంపూర్ జిల్లాలో భారీ హిమపాతంలో చిక్కుకుపోయిన 12 మందిని పోలీసులు సురక్షితంగా కాపాడారు. బాధితుల్లో మహిళలు, పిల్లలు కూడా ఉన్నారు. ప్రతికూల వాతావరణం కారణంగా - మిగతా 2 లో

### ప్రజానాడి




### రాష్ట్ర అభివృద్ధికి బ్యాంకింగ్ రంగం

# కీలక పాత్ర పోషించాలి

- రాష్ట్రానికి చేరుకున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- దావోస్ పర్యటన ముగించుకుని నేరుగా ఎస్ఎల్బీసీ సమావేశానికి హాజరైన సీఎం
- టిడ్కో ఇళ్ల రుణాలకు సంబంధించి సాంకేతిక సమస్యల పరిష్కారానికి చర్యలు
- ఎంఎస్ఎంఈలకు ఊతమిస్తేనే అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయని వెల్లడి
- డ్వాక్రా సంఘాల ఖాతాలపై విధిస్తున్న 15 రకాల ఛార్జీలను తగ్గించాలని సూచన
- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు రూ.10 కోట్లు విరాళమిచ్చిన యూనియన్ బ్యాంక్



అమరావతి : "టిడ్కో ఇళ్ల విషయంలో గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్ల వేలాది మంది లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించి, పేదలకు అండగా నిలిచేందుకు మా ప్రభుత్వం తరఫున శాయశక్తులా ప్రయత్నిస్తున్నాం. లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేసే విషయంలో ఉన్న సాంకేతిక ఇబ్బందులను తొలగించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ క్రమంలో బ్యాంకర్లు కూడా ఉదారంగా వ్యవహరించి మాకు సహకరించాలి..." అని ముఖ్యమంత్రి చంద్రబాబు బ్యాంకర్లకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించడమే తమ లక్ష్యమని, ఇందుకు బ్యాంకులు పూర్తి స్థాయిలో భాగస్వామ్యం కావాలని ఆయన ఆకాంక్షించారు.దావోస్ పర్యటనను - మిగతా 2 లో

### కూటమి ప్రభుత్వం

# చేసిందేమీ లేదు



- వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని
- చంద్రబాబు చేపట్టిన భూసర్వే ఓ దిక్కుమాలిన సర్వే అన్న పేర్ని నాని
- కూటమి ప్రభుత్వం ఒక్క కొత్త పాస్‌బుక్ అయినా ఇచ్చిందా అని ప్రశ్న
- జగన్ చేపట్టిన సమగ్ర భూ సర్వేలో ఎలాంటి లోపాలు లేవని వ్యాఖ్య

అమరావతి : చంద్రబాబు చేపట్టిన భూ సర్వే దిక్కుమాలిన సర్వే అంటూ వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో రైతులకు ఏ ఒక్క సమస్యనైనా పరిష్కరించిందా అని ప్రశ్నించారు. జగన్ హయాంలో చేపట్టిన సమగ్ర భూ సర్వేనే ఇప్పుడు - మిగతా 2 లో

# సంపాదకీయం

## నాడు దిశానిర్దేశనం... నేడు సమగ్రాభివృద్ధి

విజయవాడలో 1965లో జరిగిన భారతీయ జనసంఘ్ జాతీయ మహాసభ సాధారణ రాజకీయ సమావేశం కాదు. అది స్వాతంత్ర్యానంతరం భారతదేశానికి దిశా నిర్దేశనంతో పాటు ఏ మార్గంలో అభివృద్ధి జరగాలి? అన్న ప్రశ్నలకు సమాధానంగా నిలిచిన ఒక ఆలోచన. పాశ్చాత్య దేశాల మాదిరిగా యాంత్రిక అభివృద్ధిని గుడ్డిగా అనుసరించాలా? లేదా మన సంస్కృతిని, సమాజాన్ని కాపాడుకుంటూ ఆధునికతను స్వీకరించాలా? ఈ సందిగ్ధంలో జనసంఘ్ స్పష్టంగా చూపిన బాట భారతీయత ఆధారంగా భారతదేశ అభివృద్ధి ఉండాలి అని.జనవరి 23 నుంచి 26 వరకూ జరిగిన నాటి ఈ భారతీయ జనసంఘ్ 12వ వార్షిక మహాసభ ఒక మైలురాయి. ఇక్కడే, ఆధునిక హిందూ జాతీయవాద ఆలోచనాస్రష్ట పండిత దీనదయాళ్ ఉపాధ్యాయ... పాశ్చాత్య భౌతికవాదం, మార్క్సిస్టు సిద్ధాంతాల దుష్ట ప్రభావాలను తిరస్కరిస్తూ, భారతీయ సనాతన జ్ఞాన సంప్రదాయంపై ఆధారితమైన ఏకాత్మ మానవత అనే సమగ్ర తత్వశాస్త్రాన్ని ప్రకటించారు. ఏకాత్మ మానవత అభివృద్ధిని ఆపేది కాదు. అభివృద్ధికి దిశ చూపించేది. అభివృద్ధి అంటే గ్రామం నుంచి రాజధాని వరకూ సమాన అవకాశాలు కల్పించడం; పేదరికం నిర్మూలనతో పాటు స్వాభిమానాన్ని నిర్మించడం; ఆర్థిక బలంతో పాటు సాంస్కృతిక ఆత్మవిశ్వాసం పెంపొందించడం.ఈ మహాసభకు 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రస్తుత బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ఆధ్వర్యంలో అదే విజయవాడలోనే ఈ నెల 23, 24 తేదీలలో జరగనున్న సదస్సులో ఎనిమిది కాలాంశాలు 'నేటి కాలానికి ఏకాత్మ మానవ దర్శనం ఆవశ్యకత', 'రాజకీయ, సాంస్కృతిక దృష్టికోణం, భారతీయతప్రపంచ వ్యాప్తంగా దాని ప్రభావం', 'ఆర్థిక పరిపుష్టివికేంద్రీకరణ, సమగ్ర ఆలోచనా విధానం ద్వారా విశ్వదర్శనంభారతీయ రక్షణ', 'ఏకాత్మ మానవ దర్శనం ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన', సమకాలీన అనువర్తనాలుభవిష్యత్తు కార్యాచరణ లాంటి అనేక అంశాలను చర్చిస్తారు.1965 మహాసభను ఒక సాధారణ సమావేశంగా చూడకూడదు; ఇది ఒక దార్శనిక పరివర్తన. ఈ మహాసభలో అధ్యక్షులుగా ఎన్నికైన దీనదయాళ్... జనసంఘ్ పార్టీ 'సూత్రాలు విధానాలు' ద్వారా ఏకాత్మ మానవతను ప్రధాన భావనగా స్థాపించారు. ఈ తత్వం భారతదేశాన్ని ఒక సజీవ సమష్టిగా భావిస్తూ, భౌతిక పురోగతిని ఆధ్యాత్మిక సంపూర్ణతతో ఏకీకృతం చేస్తుంది. ఈ సిద్ధాంతం బలవంతంగా భారతీయులపై రుద్దుతున్న పాశ్చాత్య భావజాలాల్ని, సిద్ధాంతాలను వ్యతిరేకిస్తూ, భారతీయ ధర్మసంస్కృతికి అనుగుణమైన విధానాలను దీనదయాళ్ జీ ప్రతిపాదించారు.ఇందులోని కీలకమైన సూత్రాలు... అంత్యోదయ సమాజంలోని అంతిమ వ్యక్తి (చిట్టచివరి వ్యక్తి) ఉద్ధరణను ప్రధాన లక్ష్యంగా చేసుకోవడం. స్వదేశీ, స్వావలంబన విదేశీ ఆధారితను తగ్గించి, స్థానిక ఆవిష్కరణలు, వనరులను ఉపయోగించడం. వికేంద్రీకరణ కేంద్రీకృత శక్తి నుంచి గ్రామీణ, స్థానిక స్థాయిలకు అధికార వికేంద్రీకరణ. నైతిక ఆర్థికత లాభాపేక్షకు మించి, సామాజిక శ్రేయస్సును ప్రోత్సహించే ఆర్థిక వ్యవస్థ.ఈ మహాసభ నేపథ్యంలో దీనదయాళ్ జీ సాంస్కృతిక స్వాభిమానాన్ని, సమగ్రాభివృద్ధి ప్రణాళికలను బలపరచడం ద్వారా, జనసంఘ్‌ను ఒక రాజకీయ శక్తిగా ఎదిగేలా చేశారు. 1965లో జనసంఘ్ కలగన్న ఆలోచనలే 2014 నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో ప్రత్యక్ష రూపం దాల్చాయి. స్వదేశీ ఆర్థిక దృష్టి, ఆత్మనిర్భర్ భారత్, మౌలిక సదుపాయాల విప్లవం, జాతీయ భద్రతలో స్పష్టత, విదేశాంగ విధానంలో సమర్థత లాంటివి లోతుగా అమలు చేస్తూ, విశ్వశక్తిగా మన దేశం ఎదుగుతోంది. ఆత్మనిర్భర్ భారత్ స్వదేశీ ఉత్పాదనను ప్రోత్సహిస్తూ, విదేశీ ఆధారితను తగ్గించడం. ఇది దీనదయాళ్ గారి స్వావలంబన సూత్రానికి సాక్ష్యం. ఉదాహరణకు మేకిన్ ఇండియా. అంత్యోదయ సాకారం పీఎం కిసాన్, వీబీ జీరామ్‌జీ చట్టాలు, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలు అణగారిన వర్గాల జీవితాల్ని మారుస్తున్నాయి. సాంస్కృతిక పునరుత్థానం ఆర్టికల్ 370 రద్దు, అయోధ్య రామమందిర నిర్మాణం, యోగా ఆయుర్వేద ప్రపంచీకరణ లాంటివి ఏకాత్మ మానవతా ఆధ్యాత్మిక పునరుజ్జీవనాన్ని ప్రతిబింబిస్తాయి. డిజిటల్ వికేంద్రీకరణ డిజిటల్ ఇండియా, యూపీఐ వంటివి ప్రజల ఆర్థిక స్వావలంబనను పెంచుతున్నాయి. పర్యావరణ సమతుల్యత ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్, గ్రీన్ ఎనర్జీ వంటి కార్యక్రమాలు మానవప్రకృతి సమన్వయాన్ని బలపరుస్తాయి. జాతీయ భద్రత స్వదేశీ రక్షణ పరికరాలు (తేజస్ ఫైటర్, బ్రహ్మోస్ మిస్సైల్స్), 5 ట్రిలియన్ డాలర్ ఆర్థిక లక్ష్యాలు సమగ్ర అభివృద్ధి ఫలితాలు.2023 జీ20 సమ్మిట్‌లో 'ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు' అనే థీమ్, వసుధైక కుటుంబకం ఆధునిక వ్యాఖ్యానం. ఈ ఆలోచన భారతదేశాన్ని విశ్వగురుగా స్థాపిస్తుంది. అయితే, ఈ విజయాలు సవాళ్లు లేకుండా రాలేదు. ఆధునిక కాలంలో విభజనవాద శక్తులు, గ్లోబల్ అనిశ్చితులు లాంటివి ఎదురైనా తట్టుకుని ముందుకు వెళుతున్నాం.ఈ నెలలో ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న సదస్సు 1965 మహాసభను పునఃస్మరణ చేస్తూ 'దీనదయాళ్ జీ దృక్పథం ఎలా అభివృద్ధిని సమగ్రంగా రూపొందించింది, ఆధునిక భారతదేశం దానిని ఎలా సాకారం చేస్తోంది' అనే అంశాలపై లోతైన చర్చలు జరపనుంది. ఈ సదస్సు కేవలం గతాన్ని గుర్తు చేసుకోవడం కోసమే కాదు, భవిష్యత్తును రూపొందించుకోవడం కోసం కూడా. "మనం జీవితాన్ని సమగ్ర దృష్టితో చూడాలి" అని దీనదయాళ్ జీ అనేవారు. నేటి తరానికి ఏకాత్మ మానవతా దర్శనం చక్కటి మార్గదర్శకం చేస్తుందనడంలో సందేహం లేదు.

## కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకోండి

**మొదటిపేజీ తరువాయి** – కేంద్ర ప్రభుత్వంపై ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల తీవ్ర విమర్శలు గుప్పించారు. ఏపీకి ఆర్థికసాయం చేయడంలో, అమరావతికి రాజధాని హోదా కల్పించడంలో కేంద్రం తాత్సారం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రానికి ఎంతో అన్యాయం జరుగుతోందని అన్నారు. కేంద్రాన్ని అభ్యర్థించడం కంటే... కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకోవడమే బెటర్ అని చెప్పారు.కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు, నిధులు రావడం లేదని షర్మిల అన్నారు. ఇలాంటి సమయంలో ప్రధాని మోదీకి మద్దతుగా నిలవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. రాష్ట్రానికి పూర్తిగా అన్యాయం జరగక ముందే కేంద్ర ప్రభుత్వంతో పోరాడాలని సూచించారు.పేద ప్రజల ఉపాధిని నిర్వీర్యం చేసే జాతీయ ఉపాధి హామీ కొత్త చట్టానికి మద్దతు ఇవ్వడం దారుణమని అన్నారు. కొత్త చట్టంతో రాష్ట్రాలపై పెను ఆర్థిక భారం పడుతుందని చెప్పారు.

## కూటమి ప్రభుత్వం చేసిందేమీ లేదు

**మొదటిపేజీ తరువాయి** – చంద్రబాబు అనుసరిస్తున్నారని అన్నారు.తాడేపల్లిలో మీడియాతో మాట్లాడిన పేర్ని నాని.. జగన్ హయాంలో ఇచ్చిన పాస్‌బుక్‌లపై మంత్రి అనగాని పచ్చి అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సర్వే చేసి ఒక్క కొత్త పాస్‌బుక్ అయినా ఇచ్చిందా అని ప్రశ్నించారు. జగన్ హయాంలో ఇచ్చిన పాస్‌బుక్‌లను తీసుకుని, కేవలం అందులో ఉన్న జగన్ ఫొటోను తీసేయడమే తప్ప ప్రభుత్వం చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. రెవెన్యూ మంత్రికి రెవెన్యూ వ్యవస్థపై కనీస అవగాహన ఉందా అని నిలదీశారు.1995లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి రైతుల ఇబ్బందులపై ఎప్పుడైనా ఆలోచన చేశారా అని ప్రశ్నించారు. తక్కెళ్లపల్లిలో కూటమి ప్రభుత్వం ప్రారంభించిన సర్వే ఎందుకు ముందుకు సాగడం లేదని నిలదీశారు. జగన్ చేపట్టిన సమగ్ర భూ సర్వేలో ఎలాంటి లోపాలు లేవని, ఆ సర్వేనే ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఫాలో అవుతోందని అన్నారు.జగన్ హయాంలో ఆరు వేల గ్రామాల్లో సమగ్ర భూ సర్వే పూర్తయిందని గుర్తు చేశారు. ఆ సర్వేకు ఉపయోగించిన పరికరాలే ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం వినియోగిస్తోందని తెలిపారు. సర్వే ఆఫ్ ఇండియా, రెవెన్యూ శాఖ కలిసి ఏపీలో ఆధునిక సాంకేతికతతో భూ సమగ్ర సర్వే నిర్వహించిందన్నారు. డ్రోన్ ప్లే డేటా, ఓఆర్ఐ కాపీలు, శాటిలైట్ లింక్ వంటి అత్యాధునిక సాంకేతికతతో జగన్ ప్రభుత్వం చేపట్టిన భూ సర్వే ప్రపంచంలోనే అద్భుతమైనదని పేర్ని నాని స్పష్టం చేశారు.

## మంచులో 12 మంది...

## 3 గంటలు శ్రమించి కాపాడిన పోలీసులు



**మొదటిపేజీ తరువాయి** – చోచ్రు గల్లా ప్రాంతంలో కొందరు స్థానికులు మంచులో చిక్కుకున్నట్లు పోలీసులకు సమాచారం అందింది.వివరాల్లోకి వెళితే.. చోచ్రు గల్లా ప్రాంతానికి సుమారు 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న సంఘ్ పోలీస్ పోస్టుకు అత్యవసర సహాయం కోసం ఫోన్ కాల్ వచ్చింది. వెంటనే స్పందించిన పోలీసులు, ఘటనా స్థలానికి బయలుదేరారు. దట్టమైన మంచు, క్లిష్టమైన మార్గంలో సుమారు మూడు గంటల పాటు ప్రయాణించి, చిక్కుకుపోయిన వారి వద్దకు చేరుకున్నారు. పోలీసులు వృద్ధులను చేతులు పట్టుకుని సురక్షితంగా నడిపిస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.ఈ రెస్క్యూ ఆపరేషన్ విజయవంతమైనట్లు ఉధంపూర్ పోలీసులు 'ఎక్స్' వేదికగా తెలిపారు. "బసంత్‌గఢ్ ఎగువ ప్రాంతాలలో భారీ హిమపాతం కారణంగా చిక్కుకుపోయిన 12 మందిని ఉధంపూర్ పోలీసులు విజయవంతంగా రక్షించారు" అని పోస్ట్ చేశారు. బాధితులందరినీ పోలీస్ పోస్టుకు తరలించి, వారికి ఆహారం, ఆశ్రయం, వైద్య సహాయం అందించారు.మరోవైపు భారీ హిమపాతం, వర్షాల కారణంగా ఉధంపూర్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు శుక్రవారం సెలవు ప్రకటించారు. శ్రీనగర్‌లో కూడా ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు పోలీసులు ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేశారు.

# కేరళలో కొత్త రైళ్లకు ప్రధాని మోదీ పచ్చజెండా

**మొదటిపేజీ తరువాయి** – ఈ రైళ్లు తమ గమ్యస్థానాలకు బయలుదేరాయి. ఈ నాలుగు సర్వీసులను దక్షిణ రైల్వే నిర్వహించనుంది. తిరువనంతపురం -చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను కలుపుతూ ప్రయాణిస్తుంది. ఇది తెలుగు రాష్ట్రాల ప్రయాణికులకు ఎంతగానో ప్రయోజనం చేకూర్చనుంది. అలాగే, తిరువనంతపురం-తాంబరం రైలు తమిళనాడులోని పారిశ్రామిక, విద్యా కేంద్రాలకు అనుసంధానంగా ఉంటుంది.అమృత్ భారత్ రైళ్లను సామాన్యులకు తక్కువ ధరలో మెరుగైన సౌకర్యాలు



అందించేలా రూపొందించారు. ఇవి నాన్-ఏసీ రైళ్లు అయినప్పటికీ, వీటిలో ప్రయాణికుల భద్రత కోసం ప్రతి కోచ్‌లో సీసీటీవీ కెమెరాలు, ప్రతి సీటుకు ఫోన్ చార్జర్ సాకెట్, బాటిల్ హోల్డర్ వంటి వసతులు కల్పించారు. కోచ్‌లు విశాలంగా, సౌకర్యవంతంగా ఉన్నాయని ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు. సంప్రదాయ రైళ్లకు, ప్రీమియం రైళ్లకు మధ్య అంతరాన్ని తగ్గించి, తక్కువ ఛార్జీలతో మెరుగైన ప్రయాణ అనుభూతిని అందించడమే ఈ రైళ్ల లక్ష్యమని రైల్వే అధికారులు తెలిపారు.

# రాష్ట్ర అభివృద్ధికి బ్యాంకింగ్ రంగం కీలక పాత్ర పోషించాలి

**మొదటిపేజీ తరువాయి** – విజయవంతంగా ముగించుకుని శుక్రవారం రాష్ట్రానికి చేరుకున్న ముఖ్యమంత్రి, ఏమాత్రం విశ్రాంతి తీసుకోకుండా నేరుగా సచివాలయంలో జరిగిన 233, 234వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల (ఎస్ఎల్‌బీసీ) సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా 2025-26 వార్షిక రుణ ప్రణాళిక అమలు, ఎంఎస్ఎంఈలు, వ్యవసాయ రుణాల తీరుతెన్నులపై సుదీర్ఘంగా సమీక్షించారు.

**ఎంఎస్ఎంఈలే ఆర్థిక ప్రగతికి ఇంజిన్లు**

రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించాలంటే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) బలోపేతం కావడం అత్యంత ఆవశ్యకమని సీఎం స్పష్టం చేశారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని అట్టడుగు వర్గాలకు చేరాలంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉందన్నారు."బలహీన వర్గాలకు చేయూతనిచ్చే ఎంఎస్ఎంఈలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వండి. వీటిని ప్రోత్సహిస్తే ప్రాథమిక రంగంతో పాటు పారిశ్రామిక, సేవా రంగాలు కూడా సమాంతరంగా అభివృద్ధి చెందుతాయి. పేద, ధనికుల మధ్య అంతరాలు తగ్గాలంటే బడుగు వర్గాలకు ఆర్థిక చేయూత అందాలి," అని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఇప్పటివరకు ఎంఎస్ఎంఈలకు రూ. 95,714 కోట్ల మేర రుణాలు జారీ చేసినట్లు బ్యాంకర్లు ఈ సందర్భంగా సీఎంకు వివరించారు.

**నమ్మకమే పెట్టుబడి... బ్రాండింగే బలం**

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గాడి తప్పిందని, విచ్చలవిడిగా అప్పులు తేవడం వల్ల వడ్డీ భారం పెరిగిందని సీఎం గుర్తు చేశారు. అయితే, ప్రస్తుతం తమ ప్రభుత్వంపై ఉన్న క్రెడిబిలిటీ కారణంగా తక్కువ వడ్డీలకే రుణాలు తెచ్చుకునే వెసులుబాటు కలిగిందన్నారు. "క్రెడిబిలిటీ, బ్రాండింగ్‌కు మేం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. రాష్ట్రంలో రూ.2 లక్షల కోట్ల మేర రుణాలను రీ-షెడ్యూల్ చేసుకునే అవకాశం ఉంది. ఇప్పటి వరకు రూ.49 వేల కోట్ల రుణాలను రీ-షెడ్యూల్ చేయడం ద్వారా రూ.1108 కోట్ల మేర ఆదా చేసుకోగలిగాం," అని సీఎం వివరించారు. ప్రజలకు భరోసా ఇచ్చేలా పాలన సాగుతోందని, బ్యాంకర్లు కూడా అదే నమ్మకంతో ముందుకెళ్లాలని సూచించారు.

**రైతులకు, డ్వాక్రా మహిళలకు దన్ను**

వ్యవసాయ రంగానికి సంబంధించి ఇప్పటివరకు రూ. 2.96 లక్షల కోట్ల రుణాలు ఇచ్చినట్లు బ్యాంకర్లు వెల్లడించారు. అయితే, కౌలు రైతులకు, ప్రకృతి సేద్యానికి మరింత ప్రోత్సాహం అందించాలని సీఎం కోరారు. "డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసిన విధంగానే, ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లను (ఎఫ్‌పీఓ) తీర్చిదిద్దాలి. వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్ ప్రెన్యూయర్ విధానంతో ముందుకెళుతున్నాం. రాష్ట్రంలో ఏ ఒక్కరూ ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లే పరిస్థితి రాకూడదు" అని సీఎం స్పష్టం చేశారు. అలాగే, డ్వాక్రా గ్రూపుల బ్యాంక్ ఖాతాలపై ప్రస్తుతం 15 రకాల ఛార్జీలు వేస్తున్నారని, వీటిని తగ్గించి మహిళలకు ఊరట కల్పించాలని బ్యాంకర్లను ఆదేశించారు.

**ఇన్నోవేషన్ హబ్‌కు బ్యాంకుల క్యూ**

రాష్ట్రంలో స్టార్టప్‌ల ప్రోత్సాహానికి ఏర్పాటు చేస్తున్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు బ్యాంకులు పెద్ద ఎత్తున మద్దతు తెలపడంపై సీఎం హర్షం వ్యక్తం చేశారు. అమరావతిలోని ప్రధాన హబ్‌కు యూనియన్ బ్యాంక్, రాజమండ్రికి ఎస్బీఐ, అనంతపురానికి కెనరా



బ్యాంక్, విశాఖకు పంజాబ్ నేషనల్ బ్యాంక్, తిరుపతికి ఇండియన్ బ్యాంక్, విజయవాడకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులు సహకారం అందిస్తున్నాయని బ్యాంకర్లు తెలిపారు. లీడ్ బ్యాంకుగా వ్యవహరిస్తున్న యూనియన్ బ్యాంక్, తన సీఎస్సార్ నిధుల నుంచి రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు రూ. 10 కోట్లు విరాళం ప్రకటించింది.అమరావతిని ఫైనాన్స్ హబ్‌గా మార్చేందుకు బ్యాంకులు తమ కార్యాలయాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సీఎం కోరారు. భూ రికార్డుల ప్రక్షాళన, క్యూఆర్ కోడ్ ఆధారిత పట్టాదార్ పాస్ పుస్తకాల జారీ ప్రక్రియను వివరించిన సీఎం, బ్యాంకులు కూడా ఖాతాల నిర్వహణలో క్యూఆర్ కోడ్ విధానాన్ని పరిశీలించాలని సూచించారు. ఇకపై జరిగే ఎస్ఎల్బీసీ సమావేశాలకు జిల్లాల కలెక్టర్లను కూడా ఆహ్వానించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, కొండపల్లి శ్రీనివాస్, సీఎస్ విజయానంద్, వివిధ బ్యాంకుల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఇరాన్ పై కమ్ముకుంటున్న యుద్ధ మేఘాలు

**మొదటిపేజీ తరువాయి** – మధ్యప్రాచ్యంలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయా? అంటే అవుననే సంకేతాలు వెలువడుతున్నాయి. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో పాల్గొన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇరాన్ లక్ష్యంగా మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్ తమ అణు కార్యక్రమాన్ని పునరుద్ధరిస్తే, అమెరికా నుంచి మరోసారి భీకర దాడులను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. అణు ఆయుధాల తయారీకి ఇరాన్ ప్రయత్నిస్తే సహించేది లేదని, అవసరమైతే సైనిక చర్యకు వెనుకాడబోమని ట్రంప్ తేల్చిచెప్పారు.

**సైనిక మోహరింపుతో ఉద్రిక్తత**

ట్రంప్ హెచ్చరికలకు తగ్గట్టుగానే క్షేత్రస్థాయిలో అమెరికా సైనిక కదలికలు వేగవంతమయ్యాయి. అత్యాధునిక యుఎస్ఎస్ అబ్రహం లింకన్ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ స్ట్రైక్ గ్రూప్‌ను అమెరికా అరేబియన్ సముద్రం/పర్షియన్ గల్ఫ్ దిశగా తరలిస్తోంది. దీనికి తోడు ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగల్ జెట్‌లు, గగనతలంలోనే ఇంధనం నింపే కేసీ-135 ఎయిర్‌క్రాఫ్ట్‌లను అమెరికా సిద్ధం చేసింది. ఇరాన్ క్షిపణి దాడులను సమర్థంగా ఎదుర్కొనేందుకు థాడ్ (టీహెచ్ఏఏడీ), పేట్రియాట్ వంటి శక్తివంతమైన యాంటీ మిస్సైల్ సిస్టమ్స్‌ను మధ్యప్రాచ్యంలో మోహరించారు. ఇజ్రాయెల్, ఖతార్ వంటి మిత్రదేశాల్లో కూడా రక్షణ వ్యవస్థలను అమెరికా మరింత పటిష్టం చేయడం గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతకు అద్దం పడుతోంది.

**అణు కేంద్రాలపై ఆందోళన**

గత ఏడాది జూన్‌లో అమెరికా ఇరాన్ అణు కేంద్రాలపై దాడులు జరిపిన సంగతి తెలిసిందే. ఫోర్డో అణు కేంద్రంపై జరిగిన బంకర్ బస్టర్ దాడుల తర్వాత అక్కడి నుంచి సుమారు 400 కిలోల సుసంపన్న యురేనియం అదృశ్యమైందన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. గత ఏడు నెలలుగా అంతర్జాతీయ అణు శక్తి సంస్థ తనిఖీలు నిలిచిపోవడంతో ఇరాన్ రహస్యంగా అణు ఆయుధాలను తయారు చేస్తోందా అన్న అనుమానాలు బలపడుతున్నాయి.

**శాంతి చర్చలకు అవకాశం ఉందా?**




యుద్ధ వాతావరణం కనిపిస్తున్నప్పటికీ, ట్రంప్ 'బోర్డ్ ఆఫ్ పీస్' అనే కొత్త అంతర్జాతీయ సంస్థను ప్రకటించడం ఆసక్తికరంగా మారింది. గాజా సమస్యతో పాటు ప్రపంచవ్యాప్తంగా శాంతి స్థాపనకు ఈ సంస్థ కృషి చేస్తుందని ఆయన చెప్పారు. అయితే, ఇరాన్ తన ప్రాక్సీల ద్వారా హార్ముజ్ జలసంధిలో నౌకలను అడ్డుకోవడం లేదా ప్రతీకార దాడులకు దిగడం వంటివి చేస్తే పరిస్థితి చేజారిపోయే ప్రమాదం ఉంది. ఇజ్రాయెల్ కూడా తమ ఐరన్ డోమ్, అరో సిస్టమ్స్‌తో అప్రమత్తంగా ఉంది. మొత్తానికి ట్రంప్ మాటల్లో బెదిరింపులు ఉన్నప్పటికీ, చర్చలకు కూడా దారులు తెరిచే ఉంచినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఇన్నోవేషన్ సంస్థను దావోస్‌లో ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి

**మొదటిపేజీ తరువాయి** – ఆయా ఆవిష్కరణల అమలుకు కూడా అధిక ప్రాధాన్యమిస్తు న్నామన్నారు. ప్రపంచం ఏఐ పైలట్ దశ నుంచి విస్తృత అమలు దశలోకి మారుతున్న తరుణంలో బాధ్యతాయుతంగా, పారదర్శకంగా కృత్రిమ మేధను ఉపయోగించుకునే వేదికగా తెలంగాణను మేం ప్రపంచానికి పరిచయం చేస్తున్నామని వివరించారు. ప్రపంచవ్యాప్తం గా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అమలుకు ఒక ప్రయోగ వేదికగా తెలంగాణను నిలిపే లక్ష్యంతో రూపొందించిన తొలితరం సంస్థగా 'ఐకమ్' నిలుస్తుందని రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్య సాధనకు వ్యూహాత్మక దిశ అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఐకమ్ ద్వారా అది సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది భవిష్యత్ ఉద్యోగాలను సృష్టిస్తుందని రేవంత్ వివరించారు. భారత్‌ను టెక్నాలజీ వినియోగదారుడిగానే కాకుండా సృష్టికర్తగానూ మారుస్తుందని' అని సీఎం రేవంత్‌రెడ్డి విశ్వాసం వ్యక్తంచేశారు. "ప్రపంచవ్యాప్తంగా అనేక ఏఐ పాలసీలున్నాయి. పలు దేశాలు ఇప్పటికే ఏఐ మిషన్‌లను ప్రకటించాయి. వాటిలో చాలావాటికి సాధారణ లోపం ఒకటుంది. అదే అమలుకు అవసరమైన సంస్థాగత నిర్మాణం లేకపోవడం. 'ఐకమ్' ఆ లోపాన్ని భర్తీ చేస్తుంది. ఇది ఒక డిపార్ట్‌మెంట్ కాదు ఏకీకృత ఎకోసిస్టమ్. ఇది ఒక ల్యాబ్ కాదు విస్తృత జనాభా ప్రాతిపదికన సేవలందించే వేదిక. కృత్రిమ మేధపై ప్రయోగాల దశను దాటి జనాభా స్థాయికి తగ్గట్టుగా ఈ సాంకేతికతను అమలు చేసే సామర్థ్యాన్ని కలిగిన భారత సంస్థగా ఇది గుర్తింపు పొందు తుంది.అనంతరం ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఆలోచనల నుంచి ప్రపంచ స్థాయి పరిష్కారాల దాకా స్పష్టమైన అమలు మార్గాన్ని 'ఐకమ్' అందిస్తుందని వివరించారు. ప్రభుత్వ వ్యవస్థలో ఉండి కూడా స్వయంప్రతిపత్తితో పనిచేసే దీని నిర్మాణం ప్రజల విశ్వాసాన్ని చూరగొంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఎజెంటిక్ ఏఐ యుగంలో బాధ్యతాయుత స్వయంప్రతిపత్తి' అనే అంశంపై నిర్వహించిన చర్చకు ఐకమ్ వ్యవస్థాపక సీఈవో నాగార్జున కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ఐకమ్' ఆవిష్కరణ సందర్భంగా దావోస్‌లో ప్రపంచస్థాయి సంస్థలతో కృత్రిమ మేధ ఆధారిత అంశాలపై వ్యూహాత్మక అవగాహన ఒప్పందాలు కుదిరాయి.బ్రిటన్‌కు చెందిన ప్రముఖ ఎడ్యుకేషన్, పబ్లికేషన్ సంస్థ ఇది. ప్రపంచ ప్రమాణాల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) అకాడమీగా దీనికి గుర్తింపు ఉంది. ఈ ఒప్పందం ద్వారా ఏఐ శిక్షణ, పాఠ్యప్రణాళిక, లెర్నింగ్ కంటెంట్, అంచనా విధానాలు, అంతర్జాతీయ స్థాయి సర్టిఫికేషన్లలో తన స్కిల్స్‌ను పియర్సన్ ఉపయోగించనుంది.ఇది తెలంగాణ-దుబాయ్ స్టార్టప్ కారిడార్. ఈ ఎంఓయూ ద్వారా రెండు దేశాల స్టార్టప్‌లకు సంబంధించిన అభివృద్ధికి అవకాశాలను అన్వేషించనున్నారు. రెండు దేశాల మార్కెట్లు, ఎకో సిస్టమ్‌లపై అవగాహన కల్పిస్తారు.

## కార్తీకదీపం సరే... ముందు మీ దీపం ఆరిపోకుండా చూసుకోండి

**మొదటిపేజీ తరువాయి** – స్పష్టం చేశారు. రాజకీయ కక్ష సాధింపు ధోరణి ఉంటే అధికారంలోకి రాగానే చర్యలు ఉండేవని వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేటీఆర్ ముందు ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. ఇద్దరి మధ్య సంభాషణ వినడం వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని అన్నారు. కేటీఆర్ వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని కీలక వ్యాఖ్యలు చేశారు.కేసీఆర్ కుటుంబం అలీబాబా - 420 దొంగల మాదిరిగా దోపిడీకి పాల్పడిందని మహేశ్ గౌడ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ స్టువర్ట్‌పురం దొంగల బ్యాచ్‌లా మారిందన్నారు. ఆరనీకుమా ఈ కార్తీకదీపం అనే ముందు, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ దీపం ఆరిపోకుండా చూసుకోవాలని సెటైర్లు వేశారు. ఫోన్ ట్యాపింగ్‌పై కేటీఆర్ మాట్లాడటం పూర్తిగా హాస్యాస్పదమన్నారు. తోడబుట్టిన చెల్లెలు కవిత ఫోన్ ట్యాప్ చేశారని గగ్గోలు పెడుతుంటే ఇప్పటివరకు సరైన సమాధానం చెప్పలేదని గుర్తు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసు చాలా తీవ్రమైనదని, దీనిని ఉద్యమ కేసులతో పోల్చడం సరికాదని స్పష్టం చేశారు. అధికారులకు కూడా పరిమితులు ఉంటాయని అన్నారు.కాళేశ్వరం అవినీతిపై కేసీఆర్ కుటుంబంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బండి సంజయ్‌ను తాను నేరుగా ప్రశ్నిస్తున్నానని చెప్పారు. అలాగే బీజేపీ నేతలపై ఉన్న ఈడీ కేసులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మహేశ్ గౌడ్ కీలక ప్రశ్న లేవనెత్తారు. దేశ భద్రతకు ముప్పుగా మారే శక్తులపై మాత్రమే ఫోన్ ట్యాపింగ్ జరుగుతుందని, అలాంటప్పుడు సినిమా వాళ్ల ఫోన్లు ట్యాప్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. సినీ తారల ఫోన్లు ట్యాప్ చేయడం వెనుక ఉద్దేశం ఏంటని నిలదీశారు. నక్సలైట్లతో లావాదేవీలు జరుగుతున్నాయన్న అనుమానంతో తన ఫోన్‌ను కూడా ట్యాప్ చేశారని తెలిపారు. కల్వకుంట్ల కవితను తాను ఎప్పుడూ చెల్లెలుగానే గౌరవిస్తానని, ఆమె ఇప్పటికైనా నిజాలు మాట్లాడుతున్నందుకు స్వాగతిస్తున్నామని చెప్పారు. కేసీఆర్ కుటుంబంలో తగాదాలకు అసలు కారణం వాటాల పంపకంలో తేడాలేనని సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పాలనలో కేవలం మూడు నెలల్లోనే 547 ఫోన్లు ట్యాప్ అయ్యాయని ఆరోపించారు. తన మిత్రుడి ఫోన్ కూడా ట్యాప్ అయ్యిందని తెలిపారు.

## జనగామలో మంత్రి సీతక్క పర్యటనలో ఉద్రిక్తత



**మొదటిపేజీ తరువాయి** – తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్క జనగామ పర్యటనలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. జనగామ జిల్లా కేంద్రంలో అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి సీతక్క, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అనుచరుల మధ్య మాటల యుద్ధం జరిగింది.పెంబర్తి క్రాస్ వద్ద చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ప్రోటోకాల్ ప్రకారం సీతక్క, పల్లా రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని కాదని, ఈ ప్రాంత అభివృద్ధి కార్యక్రమాల్లో ఇతర నియోజకవర్గాలకు చెందిన వారికి ప్రాధాన్యత ఇచ్చారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.మరోవైపు, కొబ్బరికాయ కొట్టేందుకు బీఆర్ఎస్ నాయకులను ఎమ్మెల్యే రాజేశ్వర్ రెడ్డి ఆహ్వానించగా, ఇది బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమం కాదని కాంగ్రెస్ నాయకులు అభ్యంతరం తెలిపారు. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నేతల మధ్య వాగ్వాదం, తోపులాటకు దారితీసింది. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు 'గో బ్యాక్' అంటూ నినాదాలు చేయగా, బీఆర్ఎస్ శ్రేణులు 'జై పల్లా' అంటూ ప్రతి నినాదాలు చేశారు.

# డీజీపీ కార్యాలయానికి చేరిన న్యూబోయిగూడ మెట్రో రైళ్ల సౌండ్ న్యూసెన్స్ సమస్య



**సికింద్రాబాద్, జనవరి 23 ( ప్రజామంటలు) :** న్యూబోయిగూడ ప్రాంతంలో మెట్రో రైళ్ల వల్ల ఏర్పడుతున్న అధిక ధ్వని కాలుష్యం సమస్య రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) కార్యాలయానికి చేరింది. గత కొంతకాలంగా స్థానిక ప్రజలు, కార్యాలయాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ అంశం ఇప్పుడు అధికారికంగా పిటిషన్ స్థాయికి చేరడం గమనార్హం.గత సంవత్సరం మార్చి 6న హైదరాబాద్ మెట్రో రైల్ బృందం న్యూబోయిగూడలోని మెట్రో పిల్లర్ నంబర్ బి-1006 పరిసర ప్రాంతాల్లో సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో అర్ధరాత్రి సమయంలో మెట్రో రైళ్ల వల్ల వెలువడుతున్న ధ్వని స్థాయి 80 డెసిబెల్స్ గా నమోదైంది. ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెంబర్ 72 ప్రకారం రాత్రి సమయంలో నివాస ప్రాంతాల్లో ధ్వని స్థాయి 45 డెసిబెల్స్ కు మించకూడదు. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తున్నా మెట్రో రైల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తూ, ఎంఎన్‌కే విట్టల్ సెంట్రల్ కోర్ట్ అపార్ట్ మెంట్ ప్రెసిడెంట్ డాక్టర్ జి. హనుమాన్లు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ)కి ఫిర్యాదు చేశారు.దీనిపై స్పందించిన పీసీబీ అధికారులు గత సంవత్సరం జూన్ 13న మరోసారి సర్వే నిర్వహించగా, రాత్రి పూట మెట్రో రైళ్ల వల్ల వెలువడుతున్న ధ్వని స్థాయి 97 డెసిబెల్స్ గా నమోదైనట్లు వెల్లడించారు. ఇది నిబంధనలకు తీవ్రంగా విరుద్ధమని అధికారులు పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో సౌండ్ పొల్యూషన్ న్యూసెన్స్ పై తక్షణ చర్యలు తీసుకోవాలని పీసీబీ అధికారులు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్, ఎల్ అండ్ టీ సంస్థలతో పాటు పోలీస్ శాఖకు కూడా లేఖలు రాశారు. అయినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన చర్యలు తీసుకోలేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.దీంతో మరో మార్గం లేక డాక్టర్ జి. హనుమాన్లు రాష్ట్ర డీజీపీకి లేఖ రాశారు. దీనిపై స్పందించిన డీజీపీ, ఈ లేఖను పిటిషన్‌గా నమోదు చేసి సంబంధిత శాఖలు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు డా.జి.హనుమాన్లు తెలిపారు.

## బాసరలో ఘనంగా వసంత పంచమి ఉత్సవాలు



**నిర్మల్, జనవరి 23 (ప్రజా మంటలు) :** బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానంలో వసంత పంచమి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. సుమారు మూడు లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.వేద పండితులు గణపతి హోమం, చండీ యాగం వంటి పూజలు నిర్వహించారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి దర్శనం చేసుకున్నారు. వసంత పంచమి సందర్భంగా వేలాది మంది తల్లిదండ్రులతో పాటు జిల్లా కలెక్టర్ దంపతులు, తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు.భక్తుల సౌకర్యార్థం క్యూ లైన్లు, షెడ్లు, పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. పలు సంస్థలు అన్నదానం నిర్వహించాయి.

## వసంత పంచమి సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం



**గొల్లపల్లి జనవరి 23 ప్రజా మంటలు :** గొల్లపల్లి మండలంలోని తిరుమలాపూర్ అంగన్వాడి కేంద్రాలలో వసంత పంచమి సందర్భంగా మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి సర్పంచ్ కాశ అంజలి గంగాధర్ సూపర్వైజర్ జానకి, కార్యదర్శి విక్రమ్, విఓఏ పబ్బ జయపాల దివెనజ్యోతి వార్డ్ సభ్యులు ఓబులాపురం లచ్చయ్య, బర్గెల నరేష్ ,ఆరేల్లి తిరుమల, అంగన్వాడీ టీచర్స్ హరిత , లాల్ బి, లలిత, ఆయాలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు తల్లిదండ్రులు ,చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## వసంత పంచమి, సామూహిక అక్షరాభ్యాసం, అన్న ప్రాసన కార్యక్రమం




**ఇబ్రహీంపట్నం జనవరి 23 ( ప్రజా మంటలు దగ్గుల అశోక్) :** ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సరస్వతి మాత ముందు అంగన్వాడీ టీచర్ల ఆధ్వర్యంలో సామూహిక అక్షరాబ్యాసం, అన్న ప్రాసన కార్యక్రమం ఘనంగా జరిగింది ఈ కార్యక్రమం లో సరస్వతి మాత విగ్రహ దాత నేరెళ్ల సుభాష్ గౌడ్, ఉప సర్పంచ్ రాపెల్లి మహేష్, గ్రామపంచాయతీ కార్యదర్శి రవళి, అంగన్వాడీ టీచర్ లు వై సంజీవరాణి, సుందరగిరి గంగామణి,, ఉపాధ్యాయ లు తనుగుల రమేష్, ఉపాధ్యాయులు అల్లకట్టు సత్యనారాయణ, రాజేష్, ప్రసాద్, ప్రకాష్, ఆశా వర్కర్ జ్యోతి, అంగన్వాడి ఆయాలు శ్యామల, విమల పిల్లల తల్లులు, గర్భిణీలు, తదితరులు పాల్గొన్నారు.

## నేటి ఓటు రేపటి భవిష్యత్ జాతీయ ఓటర్ల దినోత్సవం

### విద్యార్థులచే ప్రతిజ్ఞ




**గొల్లపల్లి జనవరి 23 ప్రజా మంటలు :** జాతీయ ఓటర్ తన్యవంతమైన ప్రజాస్వామ్యం కోసం ఓటు నిజాయితీగల ఓటరు అనే నినాదంతో శుక్రవారం , గొల్లపల్లి మండల కేంద్రంలో జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో విద్యార్థులచే ఓటర్ల ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. 18 సంవత్సరాలు అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావాలని, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలియజేస్తూ, ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మమ్మద్ అబ్దుల్ మజీద్, డిప్యూటీ తాసిల్దార్ సుమన్, ఎంఇఓ చెరుకు రాజన్న, ప్రధానోపాధ్యాయులు రవి ప్రకాష్ ,దాసరి అనిత, ఆర్ఐ జీవన్, పిటి విద్యాసాగర్ ,కార్యదర్శి రాజిరెడ్డి, జీపీఓ జవహర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆక్స్ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు



**చిగురుమామిడి జనవరి 23 (ప్రజా మంటలు) :** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలోనీ ఆక్స్ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సరస్వతి పూజ మరియు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. నూతన విద్యార్థులకు ఉచిత ప్రవేశ సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అప్పాల సమ్మయ్య మాట్లాడుతూ సంవత్సరంలో వసంత పంచమి అనేది చాలా శక్తివంతమైనది మరియు పవిత్రమైన రోజు కావున పిల్లలందరూ ఈరోజు వారి వారి లక్ష్యాలను మనసులో కోరుకుని లక్ష్య సాధనకు కృషి చేసినట్లయితే కచ్చితంగా విజయం సాధిస్తారు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కూన సంపత్. ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వసంతపంచమి వేళ...చిన్నారుల అక్షరాభ్యాసం

### వేలాది మంది భక్తులతో కిక్కిరిసిన శ్రీజ్ఞానసరస్వతీ టెంపుల్




**సికింద్రాబాద్, జనవరి 23 ( ప్రజామంటలు) :** వసంతపంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి ఎదురుగా ఉన్న శ్రీజ్ఞాన సరస్వతీ దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జాము నుంచే వేలాది మంది భక్తులు తమ చిన్నారులను వెంట తీసుకొని సరస్వతీ గుడికి చేరుకున్నారు. వరసగా విడతల వారీగా ఆలయంలో సరస్వతీ దేవి అమ్మవారి సన్నిధిలో వేదపండితుల మంత్రోశ్చరణాల మద్య చిన్నారులకు అక్షరాభ్యాసం (శ్రీకారం)చేయించారు. సిటీలోని వివిద ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తుల రాకతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, భక్తుల సౌకార్యర్థమై ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మాధికారి జనార్ధన్ మూర్తి తెలిపారు. సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత మూర్తి ఆధ్వర్యంలో గాంధీనగర్ పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేసి, ట్రాఫిక్ ను నియంత్రించారు. ఆలయ వేదపండితులు, సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## వర్ష కొండలో సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా వారికి ఘన నివాళి.




**ఇబ్రహీంపట్నం జనవరి 23 (ప్రజామంటలు దగ్గుల అశోక్ ) :** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని వర్ష కొండ గ్రామంలోని బస్టాండ్ వద్ద ఉన్న "నేతాజీ సుభాష్ చంద్రబోస్" 129వ జయంతి సందర్భంగా వర్షకొండ "హిందూ సేన" ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించినారు,నేతాజీ తాను చేసిన స్వాతశీత్ర్య ఉద్యమ సృతులను గుర్తు చేసుకోవడం జరిగింది. గ్రామపంచాయతీ లో సర్పంచ్ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ ఫోటోకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పొనుకంటి చిన్న వెంకట్, ఉప సర్పంచ్ జయ నర్సయ్య, వార్డు సభ్యులు. గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులను ఇంట్లోనుంచి గెంటేసిన కొడుకు



**జగిత్యాల జనవరి 23(ప్రజా మంటలు) :** జగిత్యాల జిల్లా వెల్కటూర్ మండలం జగదేవ్ పేట గ్రామానికి చెందిన బద్దం అనంత రెడ్డి( 80),చంద్రమ్మ (75)అనే వృద్ధ తల్లి దండ్రుల ను కొడుకు కృష్ణా రెడ్డి ఇంట్లోంచి కొట్టి గెంటి వేయగ జిల్లా కేంద్రం లోని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, న్యాయవాది హరి అశోక్ కుమార్ ను ఆశ్రయించారు. కాగా శుక్రవారం ఆ వృద్ధ తండ్రి ఆర్డీవో కార్యాలయం ఆవరణలో తన గోడు విలేకరుల కు వినిపించారు.తన కొడుకు కు 5 ఎకరాలు ఇచ్చినప్పటికీ, ఇంకా మిగిలిన తన పేరిట పట్టా ఉన్న 4 ఎకరాల 35 గుంటలు, తన భార్య పేరిట పట్టా ఉన్న 1 ఎకరం 38 గుంటల భూమిని సైతం బలవంతం గా కొట్టి పాస్ బుక్ గుంజుకొని బ్యాంక్ లో మార్టిగేజ్ చేయించి అప్పు తీసుకొని తల్లి అనారోగ్యం తో ఉన్నప్పటికీ తల్లి దండ్రుల మైన మమ్మల్ని బలవంతం గా చంపుతామని కొట్టుతూ ఇంట్లోంచి బయట కు గెంటి వేషాడని ఆ తండ్రి రోదించాడు. సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆ కొడుకు కు ఫోన్ చేసినా స్పందించక పోవడం తో ఆర్డీవో కార్యాలయం ఏ వో. రవికాంత్ కు ఫిర్యాదు చేయగా వయో వృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేశారు. తన కొడుకుతో ప్రాణ భయం ఉందని సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు హరి అశోక్ కుమార్ సాయం తో ఎస్పీకి ఫిర్యాదు చేస్తానని ఆ వృద్ధ తండ్రి విలేకరుల ముందు రోదిస్తూ చెప్పాడు. సీనియర్ సిటిజెన్స్ జిల్లా ఉపాధ్యక్షులు పి. హన్మంత్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి నాయిని సంజీవ రావు తదితరులున్నారు.

## జీవితం విరక్తి చెంది క్రిమిసంహారగా మందు సేవించి మృతి

**గొల్లపల్లి జనవరి 23 ప్రజా మంటలు :** ఎండపల్లి మండలం గుళ్ళకోట గ్రామానికి చెందిన పొన్నం చందు 16 సంవత్సరములు, గత కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతు ఎన్ని ఆసుపత్రిలో చూపించిన నయం కాకపోవడంతో జీవితం పై విరక్తి చెంది గత సోమవారం గడ్డి మందు తాగగా, గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని పొన్నం లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ, ఉదయ్ కుమార్ తెలిపారు.

## కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు

### రూ.26.78 లక్షల ఆదాయం




**భీమదేవరపల్లి జనవరి 23 (ప్రజా మంటలు) :** మండలంలోని కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో హుండీని తెరిచి శుక్రవారం లెక్కించారు. దేవాదాయ శాఖ పరిశీలకులు గూడూరి సంజీవరెడ్డి పర్యవేక్షణలో జరిగిన లెక్కింపులో నోట్ల రూపంలో రూ.24,74,476, నాణేల రూపంలో రూ.2,03,705 మొత్తం కలిపి రూ.26,78,181 (అక్షరాలలో ఇరవై ఆరు లక్షల డెబ్బై ఎనిమిది వేల ఒక వంద ఎనబై ఒక రూపాయలు) ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. హుండీ ద్వారా వచ్చిన మొత్తం నగదును యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాలో జమ చేసినట్లు వెల్లడించారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో శ్రీ రాజరాజేశ్వరి సేవా సమితి (హనుమకొండ), శ్రీ సరస్వతి సేవా సమితి (కొత్తకొండ) ప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, భక్తులు, యూనియన్ బ్యాంక్ సిబ్బంది, అర్చకులు మరియు దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## కాలబైరవ సహిత అష్టభుజ గర్భగుడి నిర్మాణం





**గొల్లపల్లి జనవరి 23 ప్రజా మంటలు :** స్వస్తి శ్రీ విశ్వావసు నామ సంవత్సర మాఘ మాస శుద్ధ పంచమి శుక్రవారం ఉదయం 10:25.గంటలకు (వసంత పంచమి పర్వ దినం పురస్కరించుకొని 108 ఇటుకలతో ప్రత్యేక పూజలు నిర్వహించి గుడి నిర్మాణం ప్రారంభోత్సవానికి సమస్త భక్తాగ్రేసరులు సంకల్ప తో స్వహస్తములచే ఒక ఇటుకను పొందుపర చే కార్యక్రమం నిర్వహించారు ఇందులో భాగంగా ఈ కార్యక్రమానికి వస్తు రూపేనా ధన రూపేనా నిర్మాణానికి భూమి దాత సహకరిచిన వారందరికీ పేరుపేరునా ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు , ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు ప్రముఖులు కుల సంఘాలు నాయకులు యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు

## కొండగట్టులో రాజకీయ ఉద్రిక్తత.. అర్చకుల ధర్నాతో నిలిచిన దర్శనాలు



**కొండగట్టు, జనవరి 23 (ప్రజా మంటలు) :** ప్రసిద్ధ కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు విధులు బహిష్కరించి ధర్నాకు దిగడంతో శుక్రవారం దర్శన వ్యవస్థకు అంతరాయం ఏర్పడింది. క్యూ లైన్లలో వేలాది మంది భక్తులు నిలిచిపోగా, కొందరు దర్శనం లేకుండానే వెనుదిరిగారు. ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ జన్మదినం సందర్భంగా తెలంగాణ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు జయరామ్ చందర్ ప్రత్యేక పూజలు నిర్వహించడంతో ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ శ్రీకాంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను అవమానకరంగా భావించిన అర్చకులు ఆందోళనకు దిగారు.ఆలయ పరిపాలన తీరుపై నిరసనగా విధులు నిలిపివేయడంతో దర్శనాలు నిలిచిపోయాయి. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో స్థానిక సర్పంచ్ ఆదిరెడ్డి, ఎమ్మెల్యే జోక్యంతో అర్చకులతో చర్చలు జరిపారు. అనంతరం అర్చకులు ఆందోళనను విరమించారు.మల్యాల సీఐ నీలం రవి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. తరువాత ఆలయంలో దర్శనాలు క్రమంగా పునరుద్ధరించబడ్డాయి.

## విద్యుత్ హోర్డింగ్ కూలి ముగ్గురికి గాయాలు



**మేడారం, జనవరి 23 (ప్రజా మంటలు) :** మేడారంలో శుక్రవారం విద్యుత్ హోర్డింగ్ కూలి ముగ్గురు గాయపడిన ఘటన చోటుచేసుకుంది. ఇందులో ఒకరికి తీవ్ర గాయాలు కాగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. జంపన్నవాగుగద్దెల రోడ్డులోని హరిత 'వై' జంక్షన్ వద్ద విద్యుత్ నేమ్ హోర్డింగ్ ఏర్పాటు చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఘటన సమయంలో భక్తుల రద్దీ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.వివిధ శాఖల మధ్య సమన్వయ లోపమే ప్రమాదానికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఘటనను మొబైల్ ఫోన్లలో చిత్రీకరించేందుకు ప్రయత్నించిన వారిని అక్కడున్న అధికారులు, కాంట్రాక్టర్లు అడ్డుకున్నట్లు సమాచారం.మేడారం ఉత్సవాలకు ముందే జరిగిన ఈ ఘటన భద్రతాపై ఆందోళనకు దారి తీసింది.

## 3,4 వార్డులలో సిసి రోడ్డు డ్రైనేజీ పనులు పరిశీలించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్



**జగిత్యాల జనవరి 23 ( ప్రజా మంటలు) :** పట్టణ 3,4వార్డులలో 35 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు డ్రైనేజీ అభివృద్ధి పనులను అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించిన జగిత్యాల శాసనసభ్యులు డా సంజయ్ కుమార్ ఈ కార్యక్రమంలో నాయకులు క్యాదసు నవీన్ రంగు మహేష్ ఈశ్వర్ మతీన్ ప్రసాద్ గౌడ్ రాములు అశోక్ ఏ ఈ అనిల్ వర్క్ ఇన్స్పెక్టర్ ఉదయ్ పట్టణ నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భారత్ సురక్ష సమితి ఆధ్వర్యంలో నేతాజీ జయంతి



**జగిత్యాల జనవరి 23 (ప్రజా మంటలు) :** భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ సి ఎస్ రాజు ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ చౌరస్తా వద్ద నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి టి స్వీట్లు పంపిణీ చేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ సి ఎస్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కినపెల్లీ కాశీ నాదం, జిల్లా అధ్యక్షులు సామాజిక సమరసత చిట్ల గంగాధర్ ,మాజీ కౌన్సిలర్ అరవ లక్ష్మ, కార్యదర్శి సింగం గంగాధర్ ఉపాధ్యక్షులు వేముల పోచమల్లు పిహెచ్చి కోశాధికారి మామిడాల రాములు బొందుకూరి శ్రీనివాస్ శ్రీనివాస్ ఎడమల వెంకట్ రెడ్డి ఆర్ఎస్ఎస్ వీరన్న గొల్లపల్లి సత్యనారాయణ గౌడ్ పెండెం గంగాధర్ చిలుక రాజన్న కేఆర్ కృష్ణ హైదరాబాద్ గాజోజు సంతోష్ కుమార్ సిరిపురం గంగారం రాపర్తి రవి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవెంకటేశ్వర బ్రహ్మోత్సవాలలో మండల కళాకారులు..





**చిగురుమామిడి జనవరి 23 (ప్రజా మంటలు) :** కరీంనగర్ మార్కెట్ చౌరస్తా శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో చిగురుమామిడి మండలం సుందరగిరి, చిగురుమామిడి, లంబాడిపల్లె,ఇందుర్తి గ్రామాలకు చెందిన కళాకారులు పాల్గొని భజన కార్యక్రమం చేశారు తదుపరి వీరికి కార్యక్రమ నిర్వాహకులు ప్రశంస పత్రాలు మరియు శాలువాతో సత్కరించి మేమో ంటను ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో చిగురుమామిడి మండల కళాకారుల మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజకుమార్ తో పాటు చందబోయిన పరశురాములు,గందే కొమురయ్య,సోన్నాయిల భరత్,శ్రీరామోజు రాములు,శ్రీమూర్తి సమ్మయ్య,చిట్టంపల్లి మురళి,గూళ్ళ కొమురయ్య,నిలిగొండ కిషన్,మల్లం బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ కె ఎన్ ఆర్ కళాశాలలో మాతృ వృక్షము, వసంత పంచమి వేడుకలు



**జగిత్యాల జనవరి 23 (ప్రజా మంటలు) :** ఎస్ కే ఎన్ ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ మరియు సైన్స్ కళాశాల జగిత్యాల లో మాతృ వృక్షం మరియు వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఏ అశోక్ మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన పెంపొందించుకొని, ప్రతి జీవరాశిని గౌరవిస్తూ వాటిని కాపాడాలని తెలిపారు. వృక్షాలను సంరక్షించినట్లైతే బావి తరాలకు స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చునని తెలిపారు. మానవ మనుగడకు కారణమైన వృక్ష ,జంతు జాతులను సంరక్షిస్తూ ప్రకృతిని కాపాడాలని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఉన్న రావి చెట్టును మాతృ చెట్టుగా ప్రకటించారు. విద్యార్థులచే పుడమి తల్లి పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ చేపించారు. కార్యక్రమంలో అతిథిగా జగిత్యాల డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీ మహేష్ మాట్లాడుతూ మొక్కలను విరివిగా నాటుతూ పచ్చదనాన్ని పెంపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఆడెపు శ్రీనివాస్, గోవర్ధన్, సురేందర్ ,శ్రీనివాస్ అధ్యాపక బృందం విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ నిజాయితీపరుడైతే బీఆర్ఎస్ నేతలు జైలుకెళ్తారు

**బిఆర్ఎస్ కకుమున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థులే లేరు**

**ఎంపీ అరవింద్**



**జగిత్యాల, జనవరి 23 (ప్రజా మంటలు) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజంగా నిజాయితీపరుడైతే గత పాలనలో అవినీతికి పాల్పడ్డ బీఆర్ఎస్ నేతలు తప్పకుండా జైలుకు వెళ్లాలని బీజేపీ ఎంపీ అరవింద్ డిమాండ్ చేశారు. లేదంటే రేవంత్ ప్యాకేజీలకు లొంగుతాడా? లేక చట్టపరంగా చర్యలు తీసుకుంటాడా? అన్నది ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.జగిత్యాల జిల్లా కేంద్రంలోని పీఎంఆర్ హోటల్‌లో మున్సిపల్ ఎన్నికలపై నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సన్నాహక సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేసేందుకు అభ్యర్థులే లేరని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పరిస్థితి బలహీనంగా మారిందని, ఈ ఎన్నికలు బీజేపీకి మంచి అవకాశమని పేర్కొన్నారు.కేటీఆర్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసిన ఎంపీ అరవింద్, ఆయన డ్రగ్స్ వినియోగిస్తున్నారని ఆరోపిస్తూ డ్రగ్స్ వినియోగం, రవాణాపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. డ్రగ్స్ తీసుకునే వారికి క్యారెక్టర్ ఉంటుందా? అని ప్రశ్నించారు.గత ప్రభుత్వ హయాంలో ఫోన్ ట్యాపింగ్ జరిగిన విషయం వాస్తవమేనని, తన ఫోన్ కూడా ట్యాప్ చేశారని చెప్పారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఏ పార్టీలో ఉన్నాడో ఆయనకే తెలియని పరిస్థితి ఉందని విమర్శించారు. గతంలో ఎమ్మెల్యే తనను కలిసింది పరిపాలనా అంశాలపైనే తప్ప పార్టీ పరంగా కాదని స్పష్టం చేశారు.మాజీ మంత్రి జీవన్ రెడ్డి తనకు తండ్రితో సమానమని, ఆయన పట్ల కాంగ్రెస్ హైకమాండ్ వ్యవహరిస్తున్న తీరు బాధాకరమని అన్నారు. మున్సిపల్ ఎన్నికలు లేకపోతే తానే స్వయంగా వెళ్లి జీవన్ రెడ్డిని పరామర్శించేవాడినని చెప్పారు.సీఎం రేవంత్ రెడ్డి అసలు ఏ పార్టీలో ఉన్నాడోనన్న అయోమయం నల్గొండ, ఖమ్మం జిల్లాల కాంగ్రెస్ నాయకుల్లోనే ఉందని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ ఎల్. రమణ కూడా ఏ పార్టీలో ఉన్నాడో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు.ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు, మాజీ ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా. బోగ శ్రావణి, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి సహా పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసు - కేటీఆర్, రాధాకిషన్‌రావులను కలిపి విచారిస్తున్న సిట్

**ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు హాజరైన కేటీఆర్**

**మాజీ డీసీపీ రాధాకిషన్‌రావుతో కలిపి కేటీఆర్‌ను విచారిస్తున్న సిట్ అధికారులు**

**ప్రభుత్వం రాజకీయ డ్రామా ఆడుతోందని కేటీఆర్ వ్యాఖ్య**



ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సిట్ విచారణ కొనసాగుతోంది. ఈ కేసులో ఏ-4 నిందితుడిగా ఉన్న మాజీ డీసీపీ రాధాకిషన్‌రావుతో కలిపి కేటీఆర్‌ను అధికారులు విచారిస్తున్నారు. కేసుకు సంబంధించిన పలు అంశాలపై వీరిద్దరినీ ప్రత్యేక దర్యాప్తు బృందం ప్రశ్నిస్తోంది. రాధాకిషన్‌రావు గతంలోనూ సిట్ విచారణకు హాజరయ్యారు.ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ కార్యానిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఇవాళ సిట్ విచారణకు హాజరయ్యారు. తెలంగాణ భవన్ నుంచి బయలుదేరి జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయానికి చేరుకున్నారు. విచారణ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. అంతకుముందు తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ప్రజల దృష్టిని మరల్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు ఎన్నిసార్లు పిలిచినా హాజరవుతానన్నారు.కేసులు తమకు కొత్తకాదని, బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని కేటీఆర్ అన్నారు. ప్రజలు ఆశీర్వదిస్తే అధికారంలోకి వచ్చామన్న ఆయన, అనుక్షణం జనం కోసమే పనిచేశామన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసమే పనిచేశామని, తప్పుడు పనులు చేయలేదన్నారు. ఎంతో నిబద్ధతతో రాష్ట్రం కోసం పనిచేసినట్లు తెలిపారు. ప్రత్యర్థుల కుటుంబాలపై బురదజల్లే పనులు తాము చేయలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే సత్తా కాంగ్రెస్‌కు లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

**సిట్ విచారణకు కేటీఆర్ - ప్రభుత్వం రాజకీయ డ్రామా ఆడుతోందని మండిపాటు**

కాలయాపన చేస్తున్నారు : కొత్తకొత్త నాటకాలతో కాలయాపన చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ మండిపడ్డారు. అక్రమ, అనైతిక పనులను తాను ఎన్నడూ చేయలేదన్నారు. అధికారపార్టీవారు వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని, దిక్కుమాలిన వార్తలతో తనను క్షోభకు గురిచేశారని కేటీఆర్ ఆరోపించారు. నిబద్ధతతో పనిచేసినందునే తాను ఎవరికీ భయపడనని వివరించారు. ఇవాళ విచారణకు వెళ్తా తమ ప్రభుత్వం ఏం తప్పు చేసిందని తానే అడుగుతానని వివరించారు. లీకుల రూపంలో వ్యక్తిత్వ హననం జరుగుతోందని వాటిపైనా ప్రశ్నిస్తానన్నారు. తన పరువుకు జరిగిన నష్టానికి ఎవరు బాధ్యులో చెప్పాల్సిన అవసరం ఉందని కేటీఆర్ అన్నారు."రాష్ట్రంలో ఇప్పుడు ఫోన్లు ట్యాపింగ్ కావట్లేదని చెప్పే ధైర్యం ఎవరికైనా ఉందా? ప్రభుత్వాలను అస్థిరపరచాలనే కుట్రలను నిరోధించడానికి పోలీసు వ్యవస్థ తన పని తాను చేస్తుంది. ఫోన్ ట్యాపింగ్ అంటూ ఒక సీరియల్ మాదిరిగా రెండేళ్లనుంచి నడిపిస్తున్నారు. విచారణ పేరుతో ప్రభుత్వం నాటకాలాడుతోంది. నేను డ్రగ్స్ తీసుకుంటానని, హీరోయిన్లతో అంటూ అప్పుడప్పుడు అసత్య ప్రచారాలు చేస్తున్నారు. విచారణల పేరుతో కాలయాపన పనులే తప్ప, ఒరిగేదేమీ ఉండదు. దొరికిన దొంగలకు ఊరంతా దొంగల మాదిరిగా కనిపిస్తుంటారు. తప్పు చేయనోళ్లు ఎప్పటికీ భయపడరు"-కేటీఆర్, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడుఅందిన కాడికి దోచుకునే ముఠా ఇవాళ రాష్ట్రంలో ఉందని కేటీఆర్ ధ్వజమెత్తారు. తన పరువుకు భంగం కలిగించిన రేవంత్, ఆయన తొత్తులను కూడా వదిలిపెట్టనన్నారు. తనపై లేనిపోని లింకులు అంటగట్టి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నిసార్లు పిలిచినా విచారణకు వస్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వ అసమర్థతను ఎత్తిచూపుతూనే ఉంటామన్న ఆయన, హామీలిచ్చి నెరవేర్చకపోతే ఎండగడుతూనే ఉంటామన్నారు. కేసీఆర్‌ను తిరిగి సీఎంను చేసేవరకు సమష్టిగా పని చేస్తామన్నారు.ప్రభుత్వం రాజకీయ డ్రామా ఆడుతోందని కేటీఆర్ ఆరోపించారు. ఉద్యమం నుంచి ఉద్భవించిన నాయకత్వం బీఆర్ఎస్‌ది అని పేర్కొన్నారు. ఉద్యమ సమయంలో ఎన్నికేసులు పెట్టినా భయపడలేదన్నారు. ప్రజల ఆశీర్వాదంతో పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. అప్పుడే తనకు మంత్రి పదవి వచ్చిందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎలాంటి తప్పూ చేయలేదని వివరించారు. రాష్ట్ర పాలన పిచ్చోడి చేతిలో రాయిలా ఉందని కేటీఆర్ విమర్శించారు. విచారణకు ఎన్నిసార్లు పిలిచినా వెళ్తానని స్పష్టం చేశారు. కేసుల విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపినందుకే విచారణకు పిలుస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులు తమతో మాట్లాడేందుకు భయపడుతున్నారని కేటీఆర్ అన్నారు.

# ప్రయాణాల వేళ మహిళలూ జాగ్రత్త

**మనలో ఒకడే ఆ ఆభరణాల దొంగ!**

**బంగారం ధరతో పాటే పెరుగుతున్న చోరీలు**

**ఒక్క దొంగతనంతో రూ.లక్షల్లో లాభాలు**

**బస్సులు, రైల్వే స్టేషన్‌లలో సాధారణ ప్రయాణికుల్లా నటిస్తూ రెక్కీ చేస్తున్న కేటుగాళ్లు**



రోజురోజుకూ పెరుగుతున్న బంగారు ధరలతో పాటు వాటిపై చోరీలు కూడా పెరుగుతున్నాయి. కొందరు కేటుగాళ్లు బంగారాన్ని దొంగతనం చేయడంపైనే గురిపెడుతున్నారు. జనం ఎక్కువగా ఉండే ప్రాంతాలే వారి చోరీలకు ప్రధాన అడ్డా. ఇటీవల కాలంలో చోటుచేసుకున్న పలు సంఘటనల ద్వారా ఇది అవగతమవుతోంది. వారి చూపంతా బంగారు ఆభరణాలపైనే ఉంటుంది. రోజుకు చిన్న నగ చేతికి చిక్కినా రూ.లక్షల్లో ఆదాయం వస్తుందని ఆశపడుతూ వరుసగా చోరీలు చేస్తున్నారు. ఇటీవల జరిగిన ఘటనలు ఇవే.2025 నవంబరు 6న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ మహిళా ప్రయాణికురాలి బ్యాగులోంచి ఎవరో గుర్తు తెలియని వ్యక్తి 9 తులాల బంగారు ఆభరణాలు అపహరించాడు. క్యాంటీన్‌లో బ్రేక్‌ఫాస్ట్ చేసి సర్సంపేటకు వెళ్లే బస్సు ఎక్కి ఆధార్‌కార్డు కోసం బ్యాగ్ తెరిచే సమయానికే ఎవరో తెరిచి అందులో ఉన్న బంగారు ఆభరణాలు దోచేసినట్లు గుర్తించారు. జనవరి 17వ తేదీన మరో ఘటన చోటుచేసుకుంది. ఆర్టీసీ ప్రాంగణంలో ఓ మహిళ బస్సు ఎక్కుతుండగా తన మెడలోంచి 3 తులాల బంగారు ఆభరణాలను అపహరించారు. అయితే ఆమె జిల్లా ఆసుపత్రిలో డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పని చేస్తుంది. హనుమకొండకు వెళ్లేందుకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న క్రమంలో చోరీ జరిగింది. ఆ బంగారు ఆభరణాల విలువ రూ.4 లక్షలకు పైగా ఉంటుందని బాధితురాలు పేర్కొన్నారు.

పక్కనే ఉండి చాకచక్యంగా : ఇలాంటి చోరులు ఎక్కువగా మహిళల ప్రయాణ సమయాల్లో బస్సులు, రైళ్లలో తమ మెడల్లోంచి నేరుగా బంగారు ఆభరణాలు చోరీ చేస్తుంటారు. జన సంచారం ఉన్న ప్రాంతాల్లో వారు చోరీలు చేయడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. ఇటీవల పసిడి ధర విపరీతంగా పెరగడంతో ఆభరణాల దొంగతనాలు కూడా పెరుగుతున్నాయి. ఈ క్రమంలో ప్రజల్లో ఆందోళన మొదలైంది. బస్టాండ్లు, కూడళ్లు, అధిక జన సంచారం ఉన్న ప్రదేశాల్లో ఈ చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. వారు ఎలా ఉంటారో తెలియదు? ఎక్కడ ఉంటారో తెలియదు? ఆ కేటుగాళ్లు మనలోనే, మనలాగే ఉంటూ సాధారణ ప్రయాణికుడిలా పక్కనే ఉండి చాకచక్యంగా ఆభరణాలు కొట్టేస్తున్నారు. ఇలాంటి దోపిడీలకు గురవ్వకూడదంటే ప్రయాణ సమయాల్లో వీలైనంత వరకు తక్కువ ఆభరణాలు ధరించడం మంచిది. మరీ ముఖ్యంగా చుట్టుపక్కల గమనిస్తూ అప్రమత్తంగా ఉండటం అవసరం.మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ కెమెరాలు అలంకారప్రాయంగా ఉన్నాయి. అక్కడ నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే ప్రాంగణంలో ఈ పరిస్థితి ఉండటం ప్రయాణికులను ఆందోళనకు గురి చేస్తోంది. ఈ రెండు నెలల వ్యవధిలో బస్టాండ్‌లో రెండు ఆభరణాల చోరీలు జరిగాయి. ఇలా చోరీలు వెంటవెంటనే జరగడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. అంతేకాదు ఇదే విధంగా ఓ మహిళ బ్యాగ్, సామగ్రి అపహరణకు గురయ్యాయి. కానీ ఈ ఘటన జరిగినప్పుడు సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో పోలీసులు కూడా ఏం చేయలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు బస్టాండ్‌లో కొత్త కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇలా ఘటనలు జరగకముందే అధికారులు ఎందుకు స్పందించలేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఈ జాగ్రత్తలు తప్పనిసరి :**

రైళ్లు, బస్సు ప్రయాణంలో మహిళలు కిటికీ వద్ద కూర్చోకండి.

ఒకవేళ కిటికీ వద్ద కూర్చున్నా మహిళలు తమ మెడలోని బంగారు ఆభరణాలను స్కార్ఫ్ లేదా చీరతో కప్పేయండి.

రద్దీ ఎక్కువ ఉన్న సమయంలోనే చోరీలు జరుగుతాయి. బస్సు ఎక్కుతూ, దిగుతున్న క్రమంలో దొంగతనాలు జరుగుతుంటాయి.

ప్రయాణం చేసేటప్పుడు వీలైనంత వరకు బంగారు ఆభరణాలు ధరించకపోవడం ఉత్తమం.

తక్కువ ఆభరణాలు, లేదు అనుకుంటే నకిలీ ఆభరణాలు వేసుకోవడం మంచిది.

# మన్యం జిల్లాలో విషాదం... విషం తాగి ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి

**ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి, విషం తాగి బలవన్మరణానికి పాల్పడినట్లు సమాచారం, మృతులు మీనాక మధు (35), ఆయన భార్య సత్యవతి (30), కుమారుడు మోస్య (4)గా గుర్తింపు**



పార్వతీపురం మన్యం జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. దంపతుల కలహాలు చిన్నకుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. పిల్లలకు విషం తాగించి, దంపతులూ సేవించారు. భార్య, భర్తతో సహా నాలుగేళ్ల కుమారుడు మోస్య మృతి చెందారు. అంతేకాకుండా కుమార్తె ఆయేషా పరిస్థితి సైతం విషమంగా ఉన్నట్లు సమాచారం. దంపతుల మధ్య గొడవే కారణం: పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం వనజ గ్రామానికి చెందిన భర్త మీనాక మధు (35), భార్య మీనాక సత్యవతి (30) మధ్య గొడవ నెలకొంది. అది చినికి చినికి గాలి వానగా మారి చివరకు ఆత్మహత్యకు దారి తీసింది. దాంతో వారి పిల్లలతో సహా విషం తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఇందులో దంపతులతో పాటు వారి నాలుగేళ్ల పసివాడు మోస్య మృతి చెందగా, కుమార్తె ఆయేషా ప్రస్తుతం చినమేరంగి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. కేసు నమోదు చేసిన పోలీసులు: దీనికి సంబంధించి భార్య, భర్తల మధ్య గొడవే ఆత్మహత్యకు కారణమని గ్రామస్థులు తెలిపారు. ఉదయం ఇంటి నుంచి ఎవరూ బయటకు రాకపోవడంతో అనుమానంతో తలుపులను బద్దలుగొట్టిన స్థానికులకు అసలు విషయం తెలిసింది. దాంతో వెంటనే వారు పోలీసులకు సమాచార మిచ్చారు. అనంతరం ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

# స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల పర్యవేక్షణకు మూడంచెల వ్యవస్థ

**వచ్చే నెల నుంచి అమలులోకి!**

**జిల్లా, మున్సిపల్, మండల స్థాయిలో పర్యవేక్షణ**

**సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పలు చర్యలు చేపడుతున్న ప్రభుత్వం**




రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థలో ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకు వస్తోంది. అందులో భాగంగా వాటి పేర్లనూ మార్చేసింది. తాజాగా స్వర్ణ గ్రామ, వార్డు శాఖల్లో మూడంచెల అధికారుల వ్యవస్థ వచ్చే నెల నుంచి అమలులోకి రానుంది. ఇప్పటికే కొన్ని చోట్ల అధికారులను నియమించారు. మిగిలిన చోట్ల నెలాఖరులోగా పూర్తి చేయనున్నారు. ఫిబ్రవరి 15 నుంచి పూర్తి స్థాయిలో వ్యవస్థ అందుబాటులోకి రానుందని అధికారులు చెబుతున్నారు.ఇప్పటికే స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. జనాభా ఆధారంగా గ్రామ, వార్డు కార్యాలయాలను 3 క్యాటగిరీలుగా విభజించింది. వాటిలో 6, 7, 8 మంది చొప్పున ఉద్యోగులు ఉండేలా సర్దుబాటు కూడా చేశారు. దీంతో పాటు ఉద్యోగుల పై పర్యవేక్షణ, పరిపాలన వ్యవహారాల కోసం మండల, మున్సిపల్, జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా అధికారులను నియమించాలని నిర్ణయించారు.జిల్లా కేంద్రాల్లో శాశ్వత అధికారులను ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలోని 123 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లోను కూడా స్వర్ణ వార్డు కార్యాలయాల పర్యవేక్షణ కోసం అధికారులను నియమిస్తున్నారు. పురపాలకశాఖ నుంచి అదనపు కమిషనర్ స్థాయి అధికారులను డిప్యుటేషన్ పై తీసుకున్నారు. మండల స్థాయి పర్యవేక్షణలో 660 మంది అధికారులు ఉండగా ఇప్పటికే 610 మంది బాధ్యతలు చేపట్టారు. డిప్యూటీ ఎంపీడీవోలను ఇందుకోసం డిప్యుటేషన్‌పై తీసుకున్నారు. మరో 50 మంది కోసం పంచాయతీరాజ్ శాఖకు లేఖ రాశారు.స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో పాడైన కంప్యూటర్లు, ప్రింటర్లు, యూపీఎస్‌ల స్థానంలో రూ.22 కోట్లతో ప్రభుత్వం కొత్త వాటిని సమకూరుస్తోంది. ఇందుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ ఆధ్వర్యంలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. ఏజెన్సీలకు వర్క్ ఆర్డర్లు సైతం ఇచ్చారు. మార్చి తొలి వారంలోనే వార్డు, గ్రామ కార్యాలయాలకు సామగ్రి సరఫరా చేయనున్నారు. సచివాలయాల వ్యవస్థ ఏర్పాటు సమయంలో కేటాయించిన కంప్యూటర్లు, ప్రింటర్లు, యూపీఎస్‌ల్లో చాలా వరకు పాడయ్యాయి. దీంతో ప్రజలకు సేవలు అందించే విషయంలో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాలకు ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తున్నారు. ఒక్కో కార్యాలయానికి ఇందుకోసం నెలకు రూ.1,000 చొప్పున ప్రభుత్వం కేటాయించనుంది. స్వర్ణ గ్రామ, వార్డు శాఖ ఉద్యోగులు: దేవాదాయశాఖలోని గ్రేడ్-3 ఈవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టులను భర్తీ చేసేందుకు గానూ స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు శాఖ ఉద్యోగులను తీసుకునేందుకు దేవాదాయశాఖ కసరత్తు చేస్తోంది. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు శాఖలో అదనంగా ఉన్న ఉద్యోగులను దేవాదాయశాఖలో విలీనం చేయనున్నారు. అందుకు అనుగుణంగా గ్రేడ్-3 ఈవోలుగా పోస్టింగ్‌లు ఇచ్చేందుకు ఉన్న అవకాశాలు పరిశీలించాలంటూ ఆ శాఖ కార్యదర్శి తాజాగా మెమో జారీ చేశారు.ఇందుకు సంబంధించి విధి విధానాలు రూపొందించాలిని దేవాదాయ కమిషనర్‌ను ఆదేశించారు. మరోవైపు కమిషనర్ కార్యాలయంలో 20 జూనియర్ అసిస్టెంట్ల పోస్టులూ ఖాళీగా ఉన్నాయి. వీటికి కూడా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు శాఖకు చెందిన ఉద్యోగులను తీసుకుంటే ఫైళ్లు వేగంగా పరిష్కారం అయ్యేందుకు అవకాశం ఏర్పడుతుందనే వాదన కూడా వినిపిస్తోంది.స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల సిబ్బంది పనివేళల్లో ఉదయం పదిన్నర నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టింది. ఉద్యోగులకు ముఖ హాజరు తప్పనిసరి చేసింది. కార్యాలయంలోనే ఆన్‌లైన్ ద్వారా ఉదయం, సాయంత్రం హాజరు వేయాల్సి ఉంటుంది. హాజరు వేయకపోతే ఆ రోజు విధులకు రానట్లే. అలాగే ఆ రోజు వేతనం నిలిపేలా విధి విధానాలను తయారు చేసింది.

# జీవీఎంసీ సమీక్ష సమావేశంలో విషాదం

**ఒక్కసారిగా కుప్పకూలిన ఎస్ఈ, చికిత్స పొందుతూ మృతి**

**స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి అధికారులతో సమీక్ష**

**ఛైర్మన్ ప్రశ్నలకు బదులిస్తూ గుండెపోటుకు గురైన ఎస్ఈ గోవిందరావు**

**ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి**



మహావిశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) గాజువాక జోనల్ కార్యాలయంలో గురువారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో విషాదం చోటుచేసుకుంది. ఛైర్మన్ ప్రశ్నలకు బదులిచ్చే క్రమంలో గుండెపోటుకు గురైన మెకానికల్ సెక్షన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ) గోవిందరావు (59) అక్కడే కుప్పకూలి అపస్మారక స్థితికి చేరుకున్నారు. సపర్యలు చేసి వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ, అతని ప్రాణాలు నిలవలేదు.గాజువాకలో జనావాసాల మధ్యనున్న డంపింగ్ యార్డులో రోజుల తరబడి చెత్త పేరుకుపోవడంతో వారం రోజులుగా స్థానికులు ధర్నా చేస్తున్నారు. ఈనెల 19న గేటుకు తాళం వేసి, చెత్త వాహనాలు రాకుండా అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ గుత్తేదారుపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? కొత్త గుత్తేదారుకు ఏ లెక్కన టెండర్ ఇచ్చారు? ఈ యార్డు నుంచి చెత్తను తరలించడానికి రోజూ ఎన్ని వాహనాలు తిరుగుతున్నాయి? అన్న అంశాలపై పట్టాభిరామ్ ఎస్ఈ గోవిందరావును వివరణ అడిగారు.అస్వస్థతకు గురై వెనక్కి కుప్పకూలిపోయి : అప్పటికే ఒత్తిడితో ఉన్న ఎస్ఈ సమాధానమిచ్చిన కాసేపటికి కొబ్బరినీరు తాగి సేదదీరారు. అంతలోనే అస్వస్థతకు గురై వెనక్కి కుప్పకూలిపోయారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు వెంటనే వైద్యుల్ని రప్పించారు. వారు వచ్చి గుండెపోటుగా గుర్తించి సీపీఆర్ చేశారు. గాజువాకలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ హఠాత్పరిణామంతో పట్టాభిరామ్, పల్లా శ్రీనివాసరావు ఖిన్నులై, సమావేశాన్ని అర్ధాంతరంగా ముగించి ఆసుపత్రికి వెళ్లారు. గోవిందరావును పరామర్శించారు.గుండెపోటుతో పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో మెరుగైన చికిత్స నిమిత్తం మరో ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఐసీయూలో చికిత్స పొందుతున్న ఆయన సాయంత్రానికి మరణించారు. గోవిందరావు కుటుంబసభ్యులు, జీవీఎంసీ ఉద్యోగులు విషాదంలో మునిగిపోయారు. ఇది దురదృష్టకరమని, పాజిటివ్‌గా మాట్లాడుతూనే ఒక్కసారిగా కుప్పకూలడం ఊహించలేకపోయామని పట్టాభిరామ్ తదితరులు విచారం వ్యక్తంచేశారు.అయితే విశాఖ పాతనగరం, గాజువాకలోని చెత్త నిల్వ కేంద్రాల నుంచి కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు వ్యర్థాలను తరలించే టెండర్లు దక్కించుకున్న 'రాశా' సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఆ సంస్థకు అనుకూలంగా కొందరు ప్రజాప్రతినిధులు, పలువురు జీవీఎంసీ అధికారులు వ్యవహరించడం వల్లే తగిన చర్యలు తీసుకోలేకపోతున్నారని, ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఆయా కేంద్రాల నుంచి వ్యర్థాలను తరలించే ఒప్పందంలో భాగంగా జీవీఎంసీ ఏటా ఒక్కో కేంద్రానికి రూ.1.80 కోట్ల చొప్పున 'రాశా' సంస్థకు చెల్లిస్తుంది. ఆ నిధులతో క్లోజ్డ్ కాంపాక్షన్ వ్యవస్థ (సీసీఎస్) నిర్వహణ, సిబ్బందిని ఏర్పాటు చేసుకోవడం, జీవీఎంసీ సమకూర్చే వాహనాల నిర్వహణ కొనసాగిస్తూ, వాటి ద్వారానే చెత్తను కాపులుప్పాడకు తరలించాల్సి ఉంటుంది. వాహనాలకు అవసరమైన డీజిల్‌ను జీవీఎంసీ సమకూర్చుతుంది.ఈ ఏడాది ఇప్పటి వరకు ఒక్క టన్ను చెత్తను కూడా రాశా సంస్థ తరలించలేదు. అయినా ఎలాంటి చర్యలు లేవు. గతంలో సీసీఎస్ నిర్వహణ సరిగ్గా చేయకపోవడం, రెండు లారీలు ప్రమాదానికి గురైనా మళ్లీ వాటిని తిరిగి తీసుకురాకపోవడం... వంటి కారణాలతో రాశా సంస్థకు చెల్లించాల్సిన నిధుల్లో రూ.1.20 కోట్లు కోత విధించారు. అలాంటి సంస్థకు మళ్లీ టెండర్‌లో పాల్గొనే అవకాశం ఇవ్వడం వెనుక ఎవరి ప్రమేయం ఉందనే చర్చ సాగుతోంది.గాజువాక జోనల్ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కె.పట్టాభిరామ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చెత్త తరలింపు అంశంపై తమపై వస్తున్న 'ఒత్తిడి' అంశాన్ని జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీర్ గోవిందరాజు ప్రస్తావిం చారు. ఆ సమయంలోనే ఆయన ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలిపోయారు. ఆసుపత్రికి తీసుకువెళ్లిన తరువాత చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు.గాజువాకలో సీసీఎస్ ప్రాజెక్టు పునరుద్ధరణ, చెత్త డంపింగ్ యార్డు గోడల ఎత్తు పెంచే పనులను రూ.10 కోట్లతో చేపట్టడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆయా పనులు మళ్లీ 'రాశా'కే అప్పగించేలా ప్రయత్నాలు జరుగుతున్నాయనేది సమాచారం.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com